


ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన రామాయంపేట కాంగ్రెస్ కౌన్సిలర్లు

# బీఆర్‌ఎస్‌లోకి భారీగా వలసలు

**రామాయంపేట నుంచి ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు**

**50మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే, ఇఫ్కో డైరెక్టర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక**

రామాయంపేట, అక్టోబర్ 7: రామాయంపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతోంది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి చేరిక అనంతరం నాయకులు, కార్యకర్తలు కూడా ఒక్కొక్కరుగా బీఆర్‌ఎస్ బాట పడుతున్నారు. రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్లు బొర్ర అనిల్ కుమార్ చింతల రాధాభవానీ ఆమె భర్త చింతల యాదగిరి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సుమారు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కూడా కారు పార్టీలో చేరడంతో వారికి ఎమ్మెల్యే, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ఖండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

# అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం కేసీఆర్ లక్ష్యం

- జిల్లా కేంద్రంలో ఆత్మగౌరవ భవనాలకు శ్రీకారం
- సంగారెడ్డి అభివృద్ధికి చింతా ప్రభాకర్ సేవలు అమోఘం
- రానున్నరోజుల్లో మరింత అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- చింతా ప్రభాకర్‌ను ప్రజలు ఆశీర్వదించాలి
- కుల సంఘాల భవనాలకు రూ.25 లక్షల చొప్పున అందజేత
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 7: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం రాత్రి సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో మంత్రి కులసంఘాల భవనాలకు పట్టా పత్రాలను అందజేశారు. గౌడ సంఘం, ముదిరాజ్ సంఘం, పద్మశాలి సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రూ.25 లక్షల చొప్పున అందజేశారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కోకాపేటలో కులసంఘాల ఆత్మగౌరవ భవనాలు నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోనూ ఆయా కులసంఘాల ఆత్మగౌరవ సంఘాలను నిర్మించి ఆయా కులాల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఒక్కో భవనానికి రూ.కోటి అందజేస్తామని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని వివరించారు. ట్యాంక్ బండ్‌పై కులసంఘాల మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నామని, వారి జయంతి, వర్ధంతులను ఘనంగా, అధికారికంగా నిర్వహించుకుంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని చెప్పారు. సంగారెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని, రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. సంగారెడ్డి అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి కృషి చేస్తున్న చింతా ప్రభాకర్‌కు సీఎం కేసీఆర్ ఈసారి అవకాశం ఇచ్చినందున, ఆయనకు ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీలో మరికొంత మంది నాయకులకు వివిధ రాజకీయకంగా అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సంగారెడ్డి అభివృద్ధికి సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈసారి తనను ఆశీర్వదించి మరింత సేవ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఆయా కులసంఘాల నాయకులకు మంత్రి చేతుల మీదుగా పార్టీ కండువా వేసి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, కలెక్టర్ శరత్, డీసీసీబీ వైస్‌చైర్మన్ మాణిక్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఆయా కులసంఘాల నాయకులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలి సంఘం నేతకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

# ఎమ్మెల్యే గూడెంను పరామర్శించిన మదేశ్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి



ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న నేపాల్ దేశంమదేశ్‌ప్రదేశ్ రాష్ట్ర సీఎం సరోజ్‌కుమార్ యాదవ్

పటాన్‌చెరు, అక్టోబర్ 7: పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి కుమారుడు గూడెం విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణానికి నేపాల్ దేశం మదేశ్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన సీఎం సరోజ్‌కుమార్ యాదవ్ ఎమ్మెల్యేను కలిసి విష్ణుమృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కుటుంబం త్వరగా కోలుకుని ప్రజలకు సేవలందించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొత్తం బియ్యం డెలివరీ చేయాలి



మాట్లాడుతున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బియ్యం డెలివరీ త్వరగా చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రైస్‌మిల్లర్ల యజమానులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని బాయి ల్డ్, రారైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ బియ్యం డెలివరీ ఆలస్యంపై కారణాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లకు ఇదే చివరి అవకాశమని, బియ్యం డెలివరీ గడువు నవంబర్ 30తో ముగుస్తుందని తెలిపారు. రోజుకు మెదక్ జిల్లా నుంచి ఎఫ్‌సీఐకి 60 ఏసీకేల బియ్యం, సివిల్ సప్లయికి 70 ఏసీకేల బియ్యం పూర్తి చేస్తేనే టార్గెట్ పూర్తవుతుందన్నారు. లేకపోతే మిల్లర్లు డిఫాల్టర్లుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఒక వేళ మిల్లర్లు డిఫాల్ట్ అయితే 125 శాతం డబ్బు రూపంలో మిల్లర్ల నుంచి రికవరీ చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరికృష్ణ, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రపాల్, ఏరియా అధ్యక్షులు, జిల్లాలోని బాయిల్డ్, రా రైస్ మిల్లర్లు, సివిల్ సప్లయ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మహిళల కోసం భరోసా కేంద్రం

**రాష్ట్ర మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం**

**ప్రతి జిల్లాలో భరోసా కేంద్రం, షి-టీమ్స్**

**భరోసా కేంద్రాల ఏర్పాటును అభినందించిన సుప్రీంకోర్టు**

**రూ.2.45 కోట్లతో భవనం**

**పిల్లలు, మహిళల శ్రేయస్సుకు ఉపయోగపడుతాయి**

**సహకరించిన అరబిందో ఫార్మసీ అభినందనీయం**

**రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్**



సంగారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ అంజనీకుమార్

సంగారెడ్డి, అక్టోబర్ 7: తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం గొప్పవిషయమని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీసు కార్యాలయంలో చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్‌ను ప్రారంభించారు. అనంతరం భవానీ మందిర్, శుక్రవారం మార్కెట్ ప్రాంతంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సాయం రూ.2.45 కోట్లతో నిర్మించిన కేంద్రాన్ని ప్రారంభించారు. భరోసా కేంద్రాన్ని డీజీపీ అడిషనల్ డీజీపీ శిఖా గోయల్, సంగారెడ్డి కలెక్టర్ శరత్‌కుమార్, ఎస్పీ రమణకుమార్, టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా మహిళల భద్రతకు భరోసా కేంద్రాలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మహిళల భద్రత, ఇక్కడి పథకాలతో పాటువారి భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అభినందించారని గుర్తుచేశారు. ఈలాంటి కేంద్రాలు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి సూచించారన్నారు. పిల్లలు, మహిళలకు ఒకే దగ్గర భద్రత ఏర్పాటు వసతులు కల్పించడం తెలంగాణ ప్రభుత్వ గొప్పతనమన్నారు. శాంతిభద్రతలకు ప్ర భుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ, నేరస్థులపై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. మానసికంగా, లైంగికంగా, వేధింపులకు గురైన మహిళలు వెం టనే భరోసా కేంద్రాలను అశ్రయించి న్యాయం పొందాలని సూచించారు. భరోసా కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా భరోసా కేంద్రం పని చేస్తుందని, వైద్య, చట్టపరమైన, మానసిక కౌన్సెలింగ్‌లు చేసి మద్దతుగా నిలిచి అత్యవసర, సాధారణ సేవలను అందిస్తుందన్నారు.

## కలెక్టర్, ఎస్పీ, అరబిందో ఫౌండేషన్‌ను అభినందించిన డీజీపీ

మహిళల భద్రతకు భరోసా కేంద్రాన్ని నిర్మించేందుకు కలెక్టర్ శరత్‌కుమార్, ఎస్పీ రమణకుమార్, అరబిందో ఫౌండేషన్ ప్రతినిధులు నిత్యానందారెడ్డి, సదానందరెడ్డి సేవలు గొప్పవని డీజీపీ అంజనీకుమార్ అభినందించారు. జిల్లాలో చాలా కాలంగా పలు విద్యాసంస్థలు, కమ్యూనిటీ భవనాలు, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, తాగునీటి సమస్యకు నిధులు వంటి సామాజిక సేవలకు ఆర్థికంగా ఆదుకోవడం గొప్పవిషయమన్నారు. సంగారెడ్డిలో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని తమ అభ్యర్థనతో అరబిందో ఫౌండేషన్ యాజమాన్యం ముందుకు వచ్చి 7 వేల చదరపు అడుగుల స్థలంలో రూ.2.45 కోట్లను ఖర్చుపెట్టి అధునాతన భవనం నిర్మించడం గొప్ప విషయమన్నారు. అందుకు కలెక్టర్, ఎస్పీ దగ్గరుండి పర్యవేక్షణ చేయడంతో త్వరగా భవనం పూర్తయిందని సంతోషం వ్యక్తంచేశారు. ఎస్పీ భవన నిర్మాణంలో చురుకుగా వ్యవహరించడంతో నూతన హంగులతో భరోసా కేంద్రం నిర్మాణం జరిగిందని అభిప్రాయం వ్యక్తంచేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందించి అరబిందోను ప్రజలు గుర్తించుకునేలా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్, అదనపు ఎస్పీ అశోక్, భరోసా కేంద్ర ఇన్‌చార్జి దేవలక్ష్మి, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.